3. హలెలూయ యని పాడుఁడీ – దు:ఖించు నో – చెలియలారా వినుఁడీ = సొలయకుండఁగ మీర లటునిటు – చూచుచుండుట యెవరిని – ఫలము లేదిఁక బ్రతుకు యేసు – ప్రభుని వెదకుట మృతులలో ॥హలెలూయ॥

4. హలెలూయ యని పాడుఁడీ – యేసు ప్రభుని – వలననే గలిగెఁగనుఁడీ = యిలయుఁ బరమును సఖ్యపడియెను – గలిగె హర్షము చావుచే – సిలువ చింతలు మాని, పొందుఁడి – కలకలంబగు మోదము ॥హలెలూయ॥

5. హలెలూయ యని పాడుఁడీ – మీ భూరి చిం – తలుతీరె మది నమ్ముఁడీ = బలహీనపు చిన్న మందా!– ప్రభుని చెంతకు మరలుము – కలుగు జీవము మిమ్ము నాయన – కరుణతో నడుపును సదా ॥హలెలూయ॥

6. హలెలూయ యని పాడుఁడీ – సంఘము సదా – నిలిచి యుండును సుమండీ = పలు తెరంగుల రిపుల వలనను – బాధ లెన్నియుఁ గలిగినన్ దొలఁగ కేమియు నన్ని యడ్డుల – గెలిచి వర్ధిల్లుచుండును ॥హలెలూయ॥

7. హలెలూయ యని పాడుఁడీ – దేవుని బోధ – కులు సర్వరాష్ట్రంబుల = నెలమి మహిమకుఁ బ్రథమ ఫలమగు – యేసు రక్షణ వార్తను – వెలుఁ గువలెఁ బ్రసరింపఁ జేయుదు – రిలను ధృతితో నేర్పుతో ॥హలెలూయ॥

8. హలెలూయ యని పాడుఁడీ – భక్తులారా – విలపింపవలదు సుండీ = కలుగకుండుఁడి సందియంబులు – గడుచు కాలము శీఘ్రమే – కలుగు మీకు సమాధి మిమ్మును గౌఁగిలింప నెమ్మది ॥హలెలూయ॥

9. హలెలూయ యని పాడుఁడీ – గోధుమ గింజ – వలె బ్రతుకుదురు మీరలు = ఇల ప్రభువు తన పంటఁ గూర్చను – నేగుదెంచును జివరను – తొలఁగఁ జేయును గురుగులను గో – ధుమలనుండి నిజంబుగా ॥హలెలూయ॥

– కడియం గాబ్రియేలు

## 218 క్రీస్తు పునరుత్థానము

రా – ముఖారి తా – అట

యేసు లేచెను – ఆదివారమున – యేసు లేచెను – వేకువజామున – యేసు లేచెను ॥

1. వేకువజామున – చీఁక టుండఁగానే = యాకాశదూతలు – వీకతో రాఁ గానే ॥యేసు॥



2. సమాధిపై రాతిన్ – స్వామి దూత లిద్దరు = సమముగఁ దీయను – స్వామి లేచె నహహ ॥యేసు॥

3. మృతులలో సజీవున్ – వెతకు టేల నని = దూతలు వారితో – దాత లేఁడని తెల్పె ॥యేసు॥

4. స్త్రీలు వేగ వెళ్లి – శిష్యులకుఁ దెల్ప = జింత మారిపోయి – సందేహము తొల్గ ॥యేసు॥

5. పేతురు యోహానుల్ – పరుగెత్తుకొని వచ్చి = ప్రవేశించి గుహలో పరమానంద మొంద ॥యేసు॥

6. యేసు చచ్చి లేచె – యేసు శిష్యులట్లే = దోసంబులకుఁ జచ్చి – వాసిగ లేతురండి ॥యేసు॥

– బస్యన్ జోసఫ్

## 219 క్రీస్తు లేచెను

రా – యమన్ కళ్యాణి (చాయ: నేనును నాయింటివారును) తా – త్రిపుట

క్రీస్తు లేచెను హల్లెలూయ – క్రీస్తు నన్నులేపును = ఇద్దియె సునాద సత్యము – ఇలను చాటుడి నిత్యము ॥

1. మృతుల పునరుత్థాన పంటకు – ప్రథమ ఫలమగు క్రీస్తులో = మృతులు లేతురు నేను లేతును – నాదువరుసలో నిజమిది॥

2. పాపమరణ నరకబలములు – ప్రభుని శక్తికి ఓడెను = పాపినగు నను బ్రోవ క్రీస్తుని – ప్రాణదాన ప్రభావము॥

3. మరణమా! నీముల్లు యెక్కడ? – మరణమా! జయమెక్కడ? = మరణమా! నీముల్లు విరిగెను – మహిమ క్రీస్తులో నిప్పుడు ॥

4. శిలయు ముద్రయు బలిమికావలి – గలిబిలాయెను రాత్రిలో = ఇలయు పరమును కలుసుకొనియెను – గెలుపునొందిన క్రీస్తులో ॥

5. మృతులు నీదగువారలందరు – బ్రతికి లేతురు సత్యము = ప్రేతలను జీవింపచేయును – పృథివి క్రీస్తుని విజయము ॥

6. స్తుతియు మహిమయు ఘనత నీకె – స్తుతికి పాత్రుడ రక్షకా = స్వంత రక్తము చిందితివి నా – స్వామి యిదెనా యంజలి ॥

– బి. సూర్య ప్రకాశరావు